# జాతీయ లోక్ అదాలత్‌కు చేయుతనివ్వండి

### జిల్లా ప్రధాన న్యాయమూర్తి భరత లక్ష్మీ



నిజామాబాద్ సిటీ, బతుకమ్మ : జిల్లా వ్యాప్తంగా జూన్ మాసంలో నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ ను విజయవంతం చేయడానికి చేయుతనివ్వాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవ అధికార సంస్థ చైర్ పర్సన్ జి.వి.ఎన్ భరత లక్ష్మీ కోరారు. జిల్లాకోర్టు ప్రాంగణంలోని సమావేశపు హాల్ లో అదనపు జిల్లాజడ్జి హరీష, న్యాయసేవ సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఉదయ భాస్కర్ రావులతో కలిసి బీమా కంపెనీల స్టాడింగ్ కౌన్సిల్స్, అధికారులు, న్యాయవాదులతో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆమె ప్రసంగించారు. మోటారు రోడ్డు ప్రమాద నష్ట పరిహార దావాలను లోక్ అదాలత్ లో భీమా కంపెనీలు, న్యాయవాదులు ఒక రాజీ పరిష్కారం దిశగా అడుగులు వేస్తే, న్యాయస్థానాలు సహకరించి,సలహాలిచ్చి నష్టపరిహార దావాలను తుదిరూపం తీసుకోవడానికి చేదోడుగా నిలుస్తామని అన్నారు.లోక్ అదాలత్‌లో రాజీపద్ధతిన అవార్డులు అందుకున్న దావాలలో భీమా కంపెనీలు త్వరితగతిన నష్టపరిహార డబ్బులను కోర్టులో డిపాజిట్ చేస్తాయని తెలిపారు. అట్టి డబ్బు మోటారు వాహన ప్రమాదంలోని బాధితులకు చేరుతుందని, అది వారి ఆర్థిక అవసరాలకు పనికి వస్తుందని పేర్కొన్నారు. ముందస్తుగా కేసులను పరిష్కరించు కుంటే భీమా సంస్థలకు ఆర్థిక లబ్ది కూడా చేకూరు తుందని ఆమె తెలిపారు. బాదిత కుటుంబాల ఆర్థిక నిరీక్షణను అంతం చేసిన వారం కాగలమని తెలిపారు. జూన్ 14 న జరిగే జాతీయ లోక్ అదా లత్ ను నడిపించేది, నడక చూపించేది న్యాయమూ ర్తులు, న్యాయవాదులేనని ఆమె అన్నారు. ప్రభుత్వ, ప్రయివేటు రంగ భీమా కంపెనీలు కలిసికట్టుగా వస్తే పరిష్కారం కానిదే ముందని అభివర్ణించారు. బీమా కంపెనీల న్యాయవాదులు, నష్టపరిహార దావాలోని న్యాయవాదులు, భీమా కంపెనీల అధికారులు ఒక అంగీకారానికి వస్తే, న్యాయమూర్తులు చేదోడు వాదోడుగా నిలుస్తారని ఆమె వెల్లడించారు.

# ఎదురు కాల్పుల్లో ముగ్గురు పోలీసులు మృతి

### ఆర్ఎస్ఐకి తీవ్రగాయాలు



హైదరాబాద్, బతుకమ్మ : మావోయిస్టు పార్టీ, గ్రేహౌండ్స్ బలగాల మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో ముగ్గురు కానిస్టేబుళ్లు మృతిచెందగా, ఒక ఆర్ఎస్ఐ తీవ్రంగా గాయపడ్డారు. తెలంగాణ, చత్తీస్ ఘడ్ సరిహద్దు ప్రాంతంలో జరిగిన ఈ ఘటనపై పోలీసులు చెప్తున్న వివరాల ప్రకారం.. వాజేడు పోలీస్ స్టేషన్ పరిధిలో మందు పాతరలను గుర్తించేందుకు బుధవారం రాత్రి నుంచి పోలీసు పార్టీలు గాలింపు చర్యలు చేపట్టాయి. ములుగు జిల్లా సరిహద్దు అడవుల్లో మందుపాతరలు అమర్చామని, అటువైపు ఆదివాసీలు ఎవరూ రాకూదని ఇటీవల మావోయిస్టు పార్టీ పేరిట ఓ లేఖ విడుదలైంది. దీంతో ఆ ప్రాంతంలో మందుపాతరలను గుర్తించి నిర్వీర్యం చేయాలన్న యోచనలో వాజేడు పోలీస్ స్టేషన్ నుంచి బుధవారం రాత్రి పోలీసులు కూబింగ్ చేపట్టారు. గురువారం తెల్లవారు జామున వాజేడు మండల కేంద్రానికి 17కిలో మీటర్ల దూరంలో ఉన్న పెద్ద గుట్ట సమీపంలోని నూగురు అటవీ ప్రాంతంలో పోలీసులు మందు పాతరలను గుర్తించే పనిలో నిమగ్నం అయ్యారు. అదే ప్రాంతంలో అంబూష్ తీసుకుని ఉన్న మావోయిస్టులు పోలీసులపై కాల్పులు జరపడంతో పాటు మందు పాతరలు కూడా పేల్చారు. దాదాపు 15నిమిషాల పాటు నిర్విరామంగా మావోయిస్టులు పోలీసులపై కాల్పులు జరిపారు. దీంతో పోలీసులు కూడా ఎదురు కాల్పులు జరపడంతో మావోయిస్టులు ఘటన స్థలం నుంచి వెళ్లిపోయారు. మావోయిస్టులు దాదాపు 35 నుంచి 40మంది వరకు ఉంటారని భావిస్తున్నారు. ఈ ఎదరు కాల్పుల్లో వడ్ల శ్రీధర్, ఎన్.పవన్ కళ్యాణ్, టి.సందీప్ లు మృతి చెందారు. ఆర్ఎస్ఐ రణధీర్ కు తీవ్రంగా గాయాలు కాగా అతన్ని హైదరాబాద్ లోని ఏఐజీ ఆసుపత్రికి తరలించారు. మరణించిన పోలీసుల మృతదేహాలను వరంగంల్ ఏంజీఎం ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం పోలీస్ కమిషనరేట్ హెడ్ క్వార్టర్స్‌కు తరలించగా రాష్ట్ర మంత్రి సీతక్క, డీజీపీ జితేందర్, గ్రేహౌండ్స్ డీజీ స్టీఫెన్ రవీంద్రలు నివాళులు అర్పించారు.

## ఆపరేషన్ సిందూర్‌కు సంఘీభావ ర్యాలీ



ఎల్లారెడ్డిబతుకమ్మ: టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ సందేశం మేరకు, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ ఆదేశాల ప్రకారం, గురువారం ఎల్లారెడ్డి మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పట్టణ కేంద్రంలో "ఆపరేషన్ సిందూర్" సైనికులకు సంఘీభావ ర్యాలీ నిర్వహించారు.

# మూడేళ్ళ చిన్నారిపై వీధి కుక్క దాడి

### -స్థైర్య విహారం చేస్తున్న వీధి కుక్కలు
### -పట్టించుకోని నగరపాలక సంస్థ



నిజామాబాద్, బతుకమ్మ : నిజామాబాద్ జిల్లా కేంద్రంలో వీధి కుక్కలు స్థైర్యవిహారం చేస్తున్నాయి. వరుస దాడులతో పలువురుని గాయపరుస్తున్న నగరపాలక సంస్థ అధికారులు స్పందించడం లేదు. తూతూ మంత్రంగా కుక్కలను నియంత్రిస్తున్నామని ప్రకటనలు చేస్తూ చేతులు దులుపుకుంటున్నారు నగరంలోని ప్రతి వీధిలో వీధి కుక్కలు తమ ప్రతాపాన్ని చూపిస్తున్నాయి. ఇదే తరహాలో నిజామాబాద్ నగరంలోని 50 డివిజన్లో గురువారం ఉదయం 9:30 గంటల ప్రాంతంలో ఇంటిముందు ఆడుకుంటున్న చిన్నారిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది.ఇంట్లో వంట పని చేసుకుంటున్న మహేశ్వరి కూతురుని వీధి కుక్క నోట కరిచి గాయపరిచిందని సిసి ఫుటేజ్ ద్వారా గుర్తించి చిన్నారిని వెంటనే నిజామాబాద్ ప్రభుత్వ హాస్పిటల్లో చికిత్స నిమిత్తం తరలించారు. ఇప్పటికైనా వీధి కుక్కలను నియంత్రించాలని , రోడ్లపైన వెళ్లాలంటేనే చిన్నారులు, వృద్ధులు జంకుతున్నారు.


# అభివృద్ధిపై చర్చకు సిద్ధం

### ఆర్థిక పరిస్థితికి కారకులెవరు
### స్టేట్ కోపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి



కమ్మర్ పల్లి, బతుకమ్మ : గడిచిన పది సంవత్సరాలు అధికారంలో ఉన్న బీయర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులపై, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన 15 నెలల్లో చేసిన అభివృద్ధి పనులపై చర్చకు సిద్ధమని ప్రజా వేదిక ఏర్పాటు చేసి ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి బహిరంగ చర్చక రావాలని డీ సీ సీ ప్రెసిడెంట్, స్టేట్ కోప్రటివ్ కార్పొరేషన్ చైర్మన్ మనాల మోహన్ రెడ్డి సవాల్ విసిరారు. గురువారం మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల్ ప్రెసిడెంట్ సుంకేట రవి అధ్యక్షతన నిర్వహించి ప్రెస్ మీట్ ఆయన మాట్లాడుతూ సీ ఎం రేవంత్ రెడ్డి పైన, కాంగ్రెస్ ప్రభుత్వం పైన ప్రశాంత్ రెడ్డి చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామని, ఆ ఆరోపణలు తన అహంకార, అవివేక రాజకీయాలకు నిదర్శనమని అన్నారు.రాష్ట్రంలో అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాళా చేసి మిగులు బడ్జెట్ లో ఉన్న రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిన మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ప్రశాంత్ రెడ్డి ఎప్పుడు మాట్లాడిన ప్రభుత్వాన్ని విమర్శించడం తప్ప సలహాలు, సూచనలు ఇచ్చింది లేదన్నారు. బీయర్ఎస్ గవర్నమెంట్ ఆర్థిక వ్యవస్థతో పాటు అన్ని వ్యవస్థలను విచ్చిన్నం చేస్తే అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవస్థను సరి చేసుకుంటూ ముందుకు వెళ్తోందని అన్నారు.

## హనుమద్వాహనం పై ఊరేగిన శ్రీ లక్ష్మి నృసింహుడు



భీమ్ గల్, బతుకమ్మ : వైశాఖ శుద్ధ మోహిని ఏకాదశి గురువారం భీమ్ గల్ గ్రామాలయంలో శ్రీ వారి జయంతి ఉత్సవాలను ఆలయ అర్చకులు ఘనంగా నిర్వహించారు. ఆరవ రోజైన గురువారం ఉదయం గ్రామాలయంలోని గర్భలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించి, స్వామి వారికి హారతి, నైవేద్యం లను సమర్పించారు. సాయంత్రం స్వామి సాయంకాల పూజ అనంతరం స్వామి ఉత్సవమూర్తులను హనుమద్వాహనము పై ఆశీనుల చేసి, వాహనాన్ని అలంకరించి గ్రామాలయ పురవీధుల్లో గోవిందా... గోవిందా.. జయ నర్సింహా... జయ నర్సింహా స్వామివారిని నినాధాల మధ్య ఊరేగించారు.

## హమాలీలకు ఓఆర్ఎస్ పంపిణీ



బతుకమ్మ,మోర్తాడ్: వేసవి కాలం కావడంతో గరిష్టంగా ఉష్ణోగ్రతలు ఉన్నందున గురువారం మోర్తాడ్ మండలంలోని శెట్ పల్లీ గ్రామంలో అమ్మాలి పని చేస్తున్న వారికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించడం జరిగింది. ఈ ప్యాకెట్లను కిసాన్ సీడ్స్ గ్రీన్ విషన్ అగ్రిటెక్ కంపెనీ తరుపున పంపిణీ చేశారు. ఎండ వేడిమి వల్ల శరీరంలో డిఆర్డినేషన్ జరుగుతుంది కావున జాగ్రత్తలు పాటించాలని సూచనలు చేశారు. కార్యక్రమం లో గురిజాల నర్సారెడ్డి, క్లర్క్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ సాయి బాబా విగ్రహ ప్రతిష్ట



భీమ్ గల్, బతుకమ్మ : మండలంలోని మెండోరా గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ సాయి మందిరంలో ప్రతిష్టాపన ఉత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రతిష్టపానలో భాగంగావేద పండితులు గత మూడు రోజులుగా ప్రత్యేక పూజలను నిర్వహించారు.ఉత్సవాల్లో భాగంగా గురువారం శ్రీ సాయిబాబా విగ్రహ ప్రతిష్టాపన, యంత్ర ప్రతిష్టాపన కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు.

## తెలుగుదేశం పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలి



రుద్రూర్ (వర్ని), బతుకమ్మ: తెలుగుదేశం పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని తెదేపా రాష్ట్ర మాజీ కార్యదర్శి విట్టల్ అన్నారు. గురువారం బాన్సువాడ నియోజకవర్గంలోని వర్ని మండల కేంద్రంలో తెదేపా మెంబర్షిప్ కార్డులను కార్యకర్తలకు ఆయన చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు విట్టల్, రవికుమార్, రామకృష్ణ, బాలాజీ, శ్రీనివాస్ రావు, బి.జి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక వేసవి తరగతుల ప్రారంభం



నిజామాబాద్ సిటీ, బతుకమ్మ: తెలంగాణ విద్యాశాఖ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా గురువారం నుండి వేసవి ప్రత్యేక తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ తరగతులు నిజామాబాద్ జిల్లా ఐలాపూర్, నందిపేట్, డొంకేశ్వర్ సహా అనేక పాఠశాలల్లో ప్రారంభమై, విద్యార్థుల నుంచి విశేష స్పందనను అందుకుంటున్నాయి. జడ్పీహెచ్ఎస్ ఐలాపూర్‌లో దేశ్పాండే ఫౌండేషన్, కాకతీయ సాండ్ బాక్స్, స్కిల్ ఇన్ విలేజ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తరగతుల్లో 5వ నుండి 8వ తరగతి విద్యార్థులకు సైన్స్, గణితం, ఆర్ట్స్, లైఫ్ స్కిల్స్ లాంటి విషయాలు యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్ విధానంలో బోధిస్తున్నారు.

## ఎలాన్ మస్క్ శాట్ కామ్ సేవలకు భారత్ అనుమతి

ఢిల్లీ, బతుకమ్మ : ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ కు చెందిన శాటిలైట్ ఇంటర్నెట్ (శాట్‌కామ్) సేవల కంపెనీ స్టార్‌లింక్ భారత్‌లో సేవలందించేందుకు భారత ప్రభుత్వం అనుమతులు జారీ చేసింది. శాట్‌కామ్ లైసెన్సులో జాతీయ భద్రతకు కీలకమైన నిబంధనలకు లోబడేందుకు అంగీకరించడంతో స్టార్‌లింక్‌కు మన టెలికాం శాఖ లెటర్ ఆఫ్ ఇంటెంట్‌ను జారీ చేసినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. స్టార్‌లింక్ శాటిలైట్ టెక్నాలజీ ఆధారంగా అత్యంత వేగవంతమైన బ్రాడ్‌బ్యాండ్ సేవలనందిస్తోంది.